ఈనెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి

పరిగి, మార్చి 12: వంటగ్యాస్ వినియోగదారులు ఈనెల 31వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని పరిగి సిరి నందన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈకేవైసీ చేయించుకునేందుకు ప్రభుత్వం ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

కొబ్బరి కాయల వేలం పాట వాయిదా

కులకచర్ల, మార్చి 12 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం కొబ్బరి కాయల విక్రయానికి వేలం పాట నిర్వహించగా సరైన పాట రానందున ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసినట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి సుధాకర్ తెలిపారు. 18వ తేదీన పెద్ద జాతర ఉత్సవాల సందర్భంగా కొబ్బరి కాయలు విక్రయించుకోవడానికి వేలం పాటను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం జిల్లెల గూడ ఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాంబండ దేవాలయ చైర్మన్ నర్సమ్మా రాములు, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

గోడలపై రాతలు, ఫ్లెక్సీల తొలగింపు

కులకచర్ల, మార్చి 12: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గోడలపై ఉన్న రాజకీయనాయకులకు సంబంధించిన రాతలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నట్లు కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కులకచర్ల తహసీల్దార్, కులకచర్ల గ్రామ ప్రత్యేక అధికారి మురళీధర్ ఆదేశాల ప్రకారం గ్రామంలో ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ఉన్న అన్ని బ్యానర్లను, పోస్టర్లను, చేతిరాతలను తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎలాంటి పోస్టర్లు అతికించరాదని అన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, మార్చి 12: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ పరిధిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైప్ లైన్ లీకేజీలు ఎక్కడ ఉన్నా వాటికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సమస్యను పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని 34 వార్డుల్లో ఎక్కడ ఎలాంటి నీటి సమస్య ఉన్న, స్థానిక కౌన్సిలర్ అలాగే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పట్టణ ప్రజలకు చైర్ పర్సన్ హామీ ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్య

యాలాల, మార్చి12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన యాలాల మండల పరిధిలోని రాస్నం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... చేవెళ్ల మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన కావలి యాదమ్మ(35)కు యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన నర్సింహులుతో 23 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నర్సింహులు మేస్త్రీ పని చేసే వాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తల్లి కావలి అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

మళ్లీ తెరపైకి బోగస్ టీచర్ల బాగోతం

కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో బోగస్ టీచర్లపై విచారణ నిర్వహిస్తున్న వికారాబాద్ జిల్లా ఏడీ అబ్దుల్‌గని

- తప్పుడు ధ్రువపత్రాలతో తొలగించిన ఉపాధ్యాయులపై విచారణ
- ఆ విధంగా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను గతంలో ఉద్యోగం నుంచి తొలగించిన విద్యాశాఖ
- హైకోర్టుకు వెళ్లిన బాధిత ఉపాధ్యాయులు
- పద్ధతి ప్రకారం విచారణ చేసి వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించిన హైకోర్టు
- జిల్లా విద్యాధికారికి నివేదిక పంపిస్తామన్న వికారాబాద్ ఏడీ, నారాయణపేట్ ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్‌ఘని

కులకచర్ల, మార్చి 12 : తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఉద్యోగాలు పొందిన బోగస్ టీచర్ల బాగోతం తిరిగి తెరపైకి వచ్చింది. తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందారని ఉద్యోగం నుంచి తొలగించిన ముగ్గురు ఉపాధ్యాయులపై హైకోర్టు ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేసి మరోసారి విచారణ నిర్వహించారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఉపాధ్యాయ ఉద్యోగం పొందారని 2015లో గండీడ్ మండలానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించిన విద్యాశాఖ అధికారులు 2016లో విధుల నుంచి పెద్ద అంతారం పాఠశాలలో పనిచేస్తున్న కొండారెడ్డి, కుస్మసముద్రం చెరువుముందలి తండా పాఠశాలలో పనిచేస్తున్న రాంచందర్, దోమ మండలం ఐనాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఎల్లారెడ్డిలను ఉద్యోగం నుంచి కొండారెడ్డి చెవుడు ఉన్నట్లుగా తప్పుడు సర్టిఫికెట్ పెట్టగా, రాంచందర్ తనకు బ్లైండ్ ఉన్నట్లుగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగం పొందినట్లు గుర్తించారు. అదే విధంగా దోమ మండలం ఐనాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఎల్లారెడ్డి ఫేక్ ధ్రువపత్రాలు సమర్పించారు. తమను నేరుగా తొలగించడంపై ఉపాధ్యాయులు 2017న హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ నిర్వహించిన హైకోర్టు విద్యాశాఖ అధికారులు నేరుగా ఉద్యోగులను ఎలా తొలగిస్తారని దీనికి సంబంధించిన వివరాలు తమకు అందజేయాలని వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. తప్పుడు ధ్రువపత్రాలు పెట్టి ఉద్యోగాలు పొందితే సస్పెండ్ చేసి విచారణ నిర్వహించిన అనంతరం రుజువును బట్టి తొలగించాలని కాని ముందుగానే ఎలా సస్పెండ్ చేస్తారని, దీనిపై వివరణ తమకు సమరించాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. తొలగించిన ఉపాధ్యాయులకు రావల్సిన రెమ్యూనరేషన్ పద్ధతి ప్రకారం ఇవ్వాలని తెలియజేసినట్లు అధికారులు తెలిపారు.

తొలగించిన ఉపాధ్యాయులకు నోటీసులు

హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కులకచర్ల ఎంఈవో కార్యాలయంలో నారాయణపేట్ ఇన్‌చార్జి డీఈవో, వికారాబాద్ జిల్లా ఏడీ అబ్దుల్ ఘని తొలగించిన ఉపాధ్యాయులకు నోటీసులు అందించి దానికి వివరణ ఇవ్వాలని తెలియజేశారు. దీనికి వారు తమకు వారం రోజులు సమయం ఇవ్వాలని రాతపూర్వకంగా రాసిచ్చినట్లు తెలిపారు. వారి అభ్యర్థన మేరకు సంబంధిత వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. కాగా 2016లో విధుల నుంచి తొలగించిన ఉపాధ్యాయులు 15 డిసెంబర్ 2022న కోర్టు ద్వారా రీఆర్డర్‌ను తీసుకున్నారు. 2016లో తొలగించిన ఉపాధ్యాయులకు సంబంధించిన రీఎంక్వైరీని అక్టోబర్ 2023లో చేపట్టారు. విచారణ నిర్వహించిన జిల్లా అధికారులు వివరాలను జిల్లా అధికారులకు అందిస్తామని తెలిపారు. పంతుళ్ల బాగోతం గురించి పిటిషన్ వేసిన గండీడ్ మండలాని చెందిన గోపాల్‌ను కూడా విచారణకు జిల్లా అధికారులు పిలిచి వివరాలు తెలుసుకున్నారు. దీనికిగాను పిటిషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినవారిని పద్ధతి ప్రకారం తొలగించాలని.. అర్హులైనవారికి ఉద్యోగాలు వచ్చేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, అధికారులపై ఉందని తెలిపారు.

బీఆర్ఎస్‌దే మేయర్ పీఠం

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని కలిసిన మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

బడంగ్‌పేట, మార్చి 12: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌పై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పెట్టిన అవిశ్వాసం వీగిపోవడంతో మరోసారి మేయర్ పీఠం బీఆర్ఎస్ కైవసం చేసుకున్న సందర్భంగా మేయర్ దుర్గా, డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అవిశ్వాసం వీగిపోవడానికి పూర్తి స్థాయిలో సహకరించిన ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ కార్పొరేటర్లకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. మీర్‌పేట అభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి పెద్ద పీట వేసిన ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో కూడా ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్లు సిద్దాల పద్మ అంజయ్య, ఏనుగుల అనిల్ కుమార్, ధనలక్ష్మి రాజ్‌కుమార్, బొక్క రాజేందర్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, రేఖాలక్ష్మణ్, మీర్‌పేట పార్టీ అధ్యక్షులు అర్కల కామేశ్ రెడ్డి, జఠావత్ శ్రీను నాయక్, ప్రభాకర్ రెడ్డి, గోపీయాదవ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు..

బడంగ్‌పేట, మార్చి 12: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనిలయ కాలనీకి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు మణెమ్మ, పద్మ, శివాణీరెడ్డి, తదితరులు ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మేయర్‌ను సత్కరించిన అధికారులు..

అవిశ్వాసం వీగిపోయి మరోసారి మేయర్ పీటాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్వో అంజన్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి దేవానంద్, కార్పొరేటర్ ముద్ద పవన్ కుమార్, పి.సత్యనారాయణ శాల్వలతో సత్కరించి మిఠాయిలను తినిపించారు.

జీఎస్ఐలోని అన్ని కేడర్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్నాం

- జీఎస్ఐ ఏడీజీ, హోచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావు

మన్సూరాబాద్, మార్చి 12: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలోని అన్ని కేడర్లలో సకాలంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలిండియా జియోలాజికల్ సర్వే ఇండియన్ షెడ్యూల్డ్ క్యాస్ట్, షెడ్యూల్డ్ ట్రైబ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌథెర్న్ రీజియన్ త్రైమాసిక సమావేశంలో మంగళవారం ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎస్ఐ ఏడీజీ, హెచ్ఓడీ సీహెచ్. వెంకటేశ్వరరావును ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదార్ల మహేశ్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీహెచ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం జీఎస్ఐలో రిజర్వేషన్ రోస్టర్ కార్యకలాపాల అనుసారం ఒక పోస్ట్ నుంచి ఉన్నత స్థాయి పోస్ట్‌కు పదోన్నతి పొందే సమయంలో కచ్చితంగా నిబంధలనలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రిజర్వేషన్ల నిబంధనల ఉల్లంఘనలు జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఐలోని వివిధ విభాగాల డైరెక్టర్లు హర్మోహన్ మిశ్రా, అనూప్ ఎన్ కాంబ్లే, అసిస్టెంట్ డైరెక్టర్ కె. రాజగోపాల్, అసోసియేషన్ సభ్యులు కబిరాజ్ సేఠి, బి.లింగ్యా, బి.శ్రీనివాసరావు, జె.రాజశేఖర్, కిశోర్‌కుమార్, ఎం.చక్రేశ్వర్, ఏ.మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్, మార్చి 12: కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమం, హక్కులను కాపాడకుండా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ఎంపీలు పార్లమెంట్‌లో కార్మికుల సమస్యలపై మాట్లాడకపోవడం విడ్డురంగా ఉందన్నారు. దవాఖానలు, రైల్వేస్టేషన్లు, మెట్రో రైలు లాంటి రంగాల్లో పనిచేసే కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులకు బకాయి వేతనాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి పోరాటాలతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కమతం యాదగిరి, కార్య నిర్వాహక అధ్యక్షుడు పి.వెంకటయ్య, నాయకులు కె.రమేశ్, నరసింహ, కొమురెల్లి బాబు, దాసు పాల్గొన్నారు.

భర్త వేధింపులుభరించలేక భార్య...

ధారూరు, మార్చి 12: భర్త వేధింపులు భరించ లేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామానికి చెందిన బేగరి శివకుమార్‌కు యాలాల్ మండలం పగిడియాల్ గ్రామానికి చెందిన బేగారి తుల్జమ్మ(32)తో 2015లో వివాహం జరిగింది. శివ కుమార్ మద్యానికి బానిసై ప్రతి రోజూ భార్యను తిడుతూ మానసిక క్షోభకు గురి చేస్తూ ఉండేవాడు. ఈ నెల 10న తుల్జ మ్మ చీమల మందు తాగడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తర లించగా మంగళవారం మృతి చెందింది మృతురాలు అక్క బేగరి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

మత్స్య సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



నర్సింహులును సన్మానిస్తున్న పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ నారాయణరెడ్డి

పెద్దేముల్, మార్చి 12 : మత్స్య కారుల సంఘాలను బలోపేతం చేస్తూ వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ ఎస్.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా నూతన మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్‌గా ఎన్నికైన మంబాపూర్ గ్రామానికి చెందిన టి.నర్సింహులును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు జి.రాధాకృష్ణా రెడ్డి, మైపూజ్, టి.అంజిలయ్య,చాపల వెంకటయ్య,శివారెడ్డి, పాండు, రాములు, రత్నం,ప్రేమ్, దస్తప్ప, లాలప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



కులకచర్ల, మార్చి 12 : మండల పరిధిలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఒక రోజు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవుల, ఉపాధ్యాయులు దస్తయ్య, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్, డ్రాయింగ్ కిట్స్ అందజేత

దోమ, మార్చి 12 : మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా వైస్ ఎంపీపీ మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షుడు పొర్ల అనంతయ్య బ్యాగ్స్, డ్రాయింగ్ కిట్స్‌ను అందజేశారు. ఇందుకు ప్రత్యేక కృషి చేసిన కరణం శ్రీకాంత్‌రావు, కృష్ణకాంత్‌రావులతో పాటు ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలహెడ్ మాస్టర్ జైరాం, ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధి సుధామూర్తి, వంశీ, నాయకులు సంపల్లి మల్లేశం, శశిధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు..



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధారూరు,మార్చి 12; పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని నాగసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 జీపీఏ పాయింట్లు సాధించిన విద్యార్థులకు రూ. 10వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయుడు ప్రభులింగం, ఉపాధ్యాయులు యాదగిరి, లాలయ్య, విష్ణువర్ధన్ , శ్రీనివాస్, దామోదర్, శ్రీనివాస్, గౌరీశంకర్, వెంకటేశం, రవికుమార్, నిర్మల, శాంతమ్మ, అఫ్రుబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో..నూతన డైనింగ్ బ్లాక్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన డైనింగ్ బ్లాక్‌ను అధికారులు మంగళవారం ప్రారంభించారు. నాలుగు వేల 596 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించిన ఈ భవనంలో ఒకేసారి 237 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేయవచ్చు. రూ. 39.5 కోట్ల వ్యయంతో 500 మంది విద్యార్థులకు సరిపోయే హాస్టల్ భవన నిర్మాణం కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తుందని ప్రొఫెసర్ రవీందర్ తెలిపారు. జీ ప్లస్ 3 అంతస్థుల్లో 1.59 ఎకరాల్లో 133 గదులతో ఈ హాస్టల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. క్యాంపస్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న హాస్టళ్ల నిర్మా ణం పూర్తయితే ఇరవై ఏళ్ల వరకు విద్యార్థుల వసతికి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ మంగు పాల్గొన్నారు.

ఓయూలో ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం

ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: కేరళలోని పశువైద్య విశ్వవిద్యాలయంలో వెటర్నరీ సైన్స్ రెండో సంవత్సరం చదువుతున్న సిద్ధార్థన్ అనే విద్యార్థి ఆత్మహత్యకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ నాయకుల వలన ఒక నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీలో పనిచేస్తున్నాడనే కారణంగానే విద్యార్థిపై కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థుల సంక్షేమం కోరుకుంటున్నారా, వారి హత్యలు కోరుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీతేజ, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రీహరి, రాజు, నాయకులు అశోక్, కోటేశ్, వికాస్, సాయి, ప్రశాంత్, దృహన్, విష్ణు, చైతన్య, శివశంకర్, రాజేందర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే.. దేశానికి ప్రగతి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జయలత, గెడ్డం ఝాన్సీ, ప్రొఫెసర్ పుష్పచక్రపాణి తదితరులు

ఖైరతాబాద్, మార్చి 12: ఉత్పత్తి, వ్యాపార రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు సాధిస్తారని ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన డాక్టర్ జయలత అన్నారు. ఒక కుటుంబం ఉన్నతంగా ఎదగాలంటే తల్లి ప్రధాన పాత్రపోషిస్తుందని పేర్కొన్నారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో డీఎస్ఎస్ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు హాజరై మాట్లాడారు. జయలత, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ పుష్పచక్రపాణి, ఉషసీతాలక్ష్మి మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యంపై మహిళలు దృష్టిసారించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోక్సో యాక్ట్ తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, డీఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కదిలిన యంత్రాంగం

మోహన్‌నగర్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీ రోడ్ నంబర్ 3లో వేసేందుకు తెచ్చిన డ్రైనేజీ పైపులు

ఎల్బీనగర్, మార్చి 12: నిధులు మంజూరైనా పనులు చేయకుండా తాత్సారం చేస్తున్న అధికారుల తీరుపై నమస్తే తెలంగాణ పత్రికలో ప్రచురితమైన కథనంతో జలమండలి అధికారులు స్పందించారు. పాత డ్రైనేజీ స్థానంలో నూతన పైపులైన్ వేసేందుకు శ్రీకారం చుడుతున్నారు. అందులో భాగంగా డ్రైనేజీ పైపులు తెప్పించారు. ఒకటి, రెండు రోజుల్లో పైపులైన్ పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీ రోడ్ నంబర్ 3లో గతంలో వేసిన డ్రైనేజీ పైపులైన్ పెరిగిన జనాభా, జనవాసాలకు సరిపోకపోవడంతో తరచుగా మురుగునీరు పొంగిపొర్లి రోడ్లపై ప్రవహిస్తూ స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఈ పనులు దాదాపుగా సంవత్సరాల తరబడి ఇబ్బందిగా మారింది. ఈ పనులపై అధికారులకు ఫిర్యాదు చేస్తే పనులు చేసేందుకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడంతో మాత్రం తాత్సరం చేస్తున్నారు. ఈ విషయంపై నమస్తే తెలంగాన దినపత్రికలో మార్చి 1వ తేదీన ప్రచురితమైన వార్త కథనంతో అధికారులు స్పందించారు. ఈ రోడ్డుపై పైపులైన్ నూతనంగా మార్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు రోడ్ నంబర్ 3లో నూతనంగా వేసేందుకు నూతన డ్రైనేజీ పైపులను డంప్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు తమ డ్రైనేజీ సమస్యలు పరిష్కారం చేస్తున్నందుకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంజయ్య గౌడ్, కార్యవర్గసభ్యుడు సత్యనారాయణలు హర్షం వ్యక్తం చేశారు.